
చెత్తకుప్పలో
పుర్రె, ఎముకలు
● బెంబేలెత్తిన ఎలక్ట్రానిక్ సిటీ ప్రజలు
ధర్మస్థల పవిత్రతకు భంగం కలిగించరాదు
● హిందూ సంఘాలు, బీజేపీ డిమాండ్
● భారీ నిరసన
7

దీప గణపతి



ఐదు వేల దీపాలతో రూపొందించిన వినాయకుడు

గణనాథుడికి చిన్నారులు దీపాలతో వినూత్నంగా స్వాగతం పలికి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాలుకా పరిధిలోని శ్రీరామ నగర్ విద్యానికేతన్ పబ్లిక్ స్కూలులో సోమవారం రాత్రి విద్యార్థులు ఐదు వేల దీపాలను ఉపయోగించి భారీ గణేశ్ విగ్రహాన్ని రూపొందించారు. పర్యావరణ అనుకూల విగ్రహాన్ని తయారు చేసి దీపాలను వెలిగించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వారిని పలువురు అభినందించారు. -కంప్లి(ఆంధ్రజ్యోతి)

ఎంబీబీఎస్ సీటు నిరాకరణ

● విద్యార్థినికి రూ.15లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మేనేజ్‌మెంట్ కోటాలో 2017-18 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ సీటు నిరాకరించినందుకు హోం మంత్రి పరమేశ్వర్‌కు చెందిన సిద్దార్థ మెడికల్ కళాశాలకు రూ.15లక్షల పరిహారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. 2017 నీట్‌లో 1,95,911 ర్యాంకును పొందిన తుమకూరు విద్యార్థిని సంజనా తొలి ఏడాది ఫీజును చెల్లించారు. దీంతోపాటు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చారు. సమయానికి రికార్డులు సమర్పించారు. అయితే కళాశాలలో అడ్మిషన్ ఇవ్వలేదు. అంతకంటే అధిక ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు ఇచ్చారు. 2018లో ఉచితంగా సీటు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే నమ్మకం లేకపోవడంతో విద్యార్థిని బసవేశ్వర మెడికల్ కళాశాలలో చేరారు. తన ఫీజును తిరిగి ఇవ్వాలని విద్యార్థిని యాజమాన్యాన్ని కోరింది. చెల్లించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో వారు న్యాయం కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రూ.5కోట్ల పరిహారంతోపాటు ఎంబీబీఎస్ చదివేందుకు చెల్లించిన ఫీజు మొత్తాన్ని పరిహారంగా ఇవ్వాలని పేర్కొన్నారు. ధర్మాసనం రూ.15లక్షలు పరిహారంగా రెండు నెలల్లోపు ఇవ్వాలని మంగళవారం ఆదేశించింది.

దళిత సంఘాలతో
మంత్రి మునియప్ప భేటీ
7

వందనం వక్రతుండా..!



అమ్మకానికి ఉంచిన పత్రి



● బెళగావిలో 120 ఏళ్ల క్రితమే గణేశ్ ఉత్సవాలు

● రాష్ట్రంలో నూరేళ్లు దాటిన పలు ఉత్సవ కమిటీలు ● సంప్రదాయాల్లో ఒక్కో జిల్లాది ఒక్కో ప్రత్యేకత



బెళగావి తొలి వినాయక ఉత్సవాల్లో బాలగంగాధర తిలక్

బెంగళూరు, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వినాయక ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎన్నో కమిటీలు వంద సంవత్సరాలకు ఉత్సవాలు నిర్వహించడం కన్నడనాడు ప్రత్యేకత. నాటి నుంచి నేటి వరకూ వక్రతుండుడి వైభవం కొనసాగుతోంది. పైబడి స్వాతంత్ర్యపోరాటానికి జనసమీకరణ కోసం దేశవ్యాప్తంగా గణేశ ఉత్సవాలను జరపడం ద్వారా కొత్త ఉద్యమానికి తెరలేపారనేది తెలిసిందే. రాష్ట్రంలో తొలి వినాయక ఉత్సవాలకు 1905లో బాలగంగాధర తిలక్ శ్రీకారం చుట్టారు. స్థానిక మార్కెట్‌లో తొలిసారిగా గణేశమూర్తిని ప్రతిష్ఠించారు. ఈ సంఘటన దేశస్వాతంత్ర్య పోరాటంలో మహత్తరమైన సన్నివేశంగా నిలిచింది. ఇది కేవలం ఆధ్యాత్మిక పండుగ కాలేదు. బ్రిటీష్‌వారిపై పోరాటం చేసేందుకు ప్రజలను సమీకరించే ప్రయత్నంగా మలిచారు. గడిచిన 120 ఏళ్లుగా గణేశ పండుగ ఎన్నో మార్పులు జరిగింది. గణేశ పండుగ అంటే సాంస్కృతిక పరంపర, సమకాలీన సామాజిక అంశాలను సమ్మైక్య పరిచే వేడుక అయ్యింది. బెళగావిలో ప్రజాగణేశ ఉత్సవం జరిగే ప్రముఖ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది.

1905లో తొలి ప్రజా గణేశ్ మూర్తి

తొలి ప్రజా గణేశ మూర్తిని 1905 సెప్టెంబరు 2న లోకమాన్య బాలగంగాధర తిలక్ స్థానిక శాంతారం పాట్నేకర్ దుకాణంలో ప్రతిష్ఠించారు. స్థానికంగా పేరొందిన గోవిందరావు యాళగి, విష్ణు పాట్నీకర్, గోపాల్ పట్నేకర్, రామచంద్ర ముర్కొంబి, శంకర కలఘటిగ, వామన కలఘటిగలు పాల్గొన్నారు. బ్రిటీష్‌వారి కంటపడకుండా, అధికారుల పరిశీలనలు గణేశ ఉత్సవాలపై ప్రభావం చూపకుండా బాలగంగాధర తిలక్ ఫొటో లను తీసుకోవడాన్ని నిషేధించారు. బెళగావి వ్యాప్తంగా భిన్నమైన రూపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలు సిద్ధమవుతున్నాయి. ఇక్కడ 25-30 అడుగుల ఎత్తుతో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నందున కళాకారులు నెలరోజులుగా విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉన్నారు. కొన్ని మండపాలు ప్రత్యేక సందేశాన్ని ఇచ్చేలా రూపకల్పన చేస్తున్నారు.

ప్రతి రోజూ ఆరోగ్యంపై ప్రచారం

పయోనీర్ అనే గణేశమండపం స్థాపించే ఉద్దేశ్యం ఇప్పటికీ ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ జరిపే కార్యక్రమాలు ఆరోగ్య పోటీలలో ఒకటిగా ఉంటుంది. ఆరోగ్యమే సంపద అనే సందేశాన్ని ఇస్తుంది. యువత డ్రగ్స్, మద్యపానం, ఆరోగ్యానికి హానికరమైన వ్యసనాలను దూరం చేసేందుకు ఈ మండపంలో గణేశ ప్రతిష్ఠ చేసినప్పటినుంచి నిమజ్జనం దాకా ప్రతిరోజూ ఓ ఆరోగ్య చైతన్య కార్యక్రమం నిర్వహిస్తారు. బెళగావిలో ఉత్సాహభరితం, అర్థపూర్ణమైన గణేశ ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నట్టు గణేశ ఉత్సవ మార్కెట్ నిర్వహణా కమిటీ సభ్యులు వికాస కలఘటగి తెలిపారు. ఇక్కడ ఎత్తైన వినాయక విగ్రహాలు మాత్రమే కాకుండా ఐక్యత సంస్కృతి, ప్రగతిని ప్రేరేపించేలాంటి పరంపర కల్గిన మూర్తులను ప్రతిష్ఠించడం ప్రత్యేకత అనిపిస్తోంది. బెళగావిలో గణేశ ఉత్సవాలు బాలగంగాధర తిలక్ ప్రారంభించిన కాలంలో ఇటు కర్ణాటకతోపాటు అటు మహారాష్ట్ర ప్రాంతంలోనూ ప్రత్యేకత చాటుకున్నాయి.

దేశభక్తితో మొదలైన దైవభక్తి

దేశభక్తికోసం ప్రారంభమైన ఈ ఉత్సవం ప్రస్తుతం ఒక ఆధ్యాత్మిక ఆచరణగా మారింది. బెళగావిలో 370కుపైగా ప్రాంతాల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడిని ప్రతిష్ఠిస్తారు. నగరవ్యాప్తంగా గణేశ ఉత్సవాలు ఓ మహత్తరమైన వేడుకగా ప్రసిద్ధి చెందాయి. కొన్ని మండపాలు ఏర్పడి 75ఏళ్లు పైబడగా మరికొన్ని మండపాలు ఏర్పడి వందేళ్లకు సమీపంలో ఉన్నాయి. ప్రతి మండపంలోనూ పండుగకు సంసిద్ధత చేసుకుంటున్నారు. హిందూ ధర్మ గ్రంథాలు, ఆధునిక యుగం, సామాజిక సమస్యలు పర్యావరణ చైతన్యం కలిగించే పలు అంశాలకు సందేశాలు ఇచ్చేలా వేడుకలు జరుపుతారు.

45 ఏళ్లుగా మట్టి గణపతుల పంపిణీ

● పర్యావరణ పరిరక్షణలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు

పర్యావరణ పరిరక్షణకు ఆ ఉపాధ్యాయుడు కంకణం కట్టుకున్నారు. ఉడుపి జిల్లాలో రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ శేఖర్ కల్మాడి నాలుగున్నర దశాబ్దాలుగా మట్టి గణపతులను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక నెహ్రూరా హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసి రిటైరయ్యానని, మట్టితో విగ్రహాలు తయారు చేయడం తనకెంతో ఇష్టమన్నారు. 45ఏళ్లుగా ఏటా రెండు అడుగుల నుంచి ఐదు అడుగుల దాకా విగ్రహాలు తయారు చేస్తున్నానన్నారు. స్థానిక వినాయక కమిటీలకు ఉచితంగా అందజేస్తానని, ఎవరివద్దా డబ్బులు తీసుకునేది లేదన్నారు. వినాయక చవితి పండుగకు రెండు నెలల ముందునుంచే మట్టి సిద్ధం చేసుకుని తొలుత విగ్రహాలు తయారు చేస్తానన్నారు. తర్వాత వాటికి అవసరమైన నాణ్యమైన రంగులు వేస్తానన్నారు. 38ఏళ్లపాటు సర్వీస్ చేశానని, ప్రశాంత జీవితం గడుపుతున్నానన్నారు.



మట్టి వినాయక విగ్రహాలతో రిటైర్డ్ టీచర్ శేఖర్ కల్మాడి

ప్రత్యేకమైన సౌతడ్క గణపతి

● 72వేల కజ్జాయిలు, 5వేల లడ్డూలతో నివేదన ● రోజూ వేలాదిమందికి అన్నదానం ● దక్షిణ కన్నడ జిల్లాలో చారిత్రాత్మకం



పూజలందుకుంటున్న సౌతడ్క గణపతి(ఫైల్)



ప్రసాద పంపిణీకి తయారు చేస్తున్న మోదకాలు

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ప్రాంతానికో చరిత్ర ఉంది. చతుర్థి రోజున వినాయకుడిని ప్రతిష్ఠించి 3-9 రోజులపాటు పూజలు చేసి నిమజ్జనం చేయడం సంప్రదాయం. దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా కొక్కడ గ్రామానికి సమీపంలో సౌతడ్క గంటి గణపతి ఆలయంలో అప్పుడే వేడుకలకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇక్కడ ప్రత్యేకమైన గర్భగుడి ఉండదు. కానీ బహిరంగప్రదేశంలోనే గణపతి విగ్రహం ఉంటుంది. ఈ ఏడాది ఉత్సవాలు ఆడంబరంగా జరిపేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. బుధవారం ఉదయం 108 కొబ్బరికాయలు కొడతారు. గణహోమం, రంగపూజ, మహాపూజల తర్వాత అన్నసంతర్పణ చేస్తారు. సౌతడ్క గణేశ ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణ అంటే మోదకాల తయారీ. దినేశ్ మెహందల్ నేతృత్వంలో వందమంది పాకనిపుణులు మోదకాలు తయారు చేస్తున్నారు. 600 టెంకాయలు, 230 కేజీల బెల్లం, 50 కేజీల నెయ్యి, రెండున్నర క్వింటాళ్ల మైదా ఉపయోగించి 30వేల మోదకాలను తయారు చేసి వినాయకుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇక పంచకజ్జాయ, లడ్డూ ప్రసాదం చేస్తారు. 12వేల అటుకుల పంచ కజ్జాయలను సిద్ధం చేస్తున్నారు. 5వేల లడ్డూల తయారీకి 5వేల కొబ్బరికాయలు, 3,600 కేజీల అటుకులు, 1200 కేజీల బెల్లం ఉపయోగిస్తారు. మరోవైపు 60వేల అప్పకజ్జాయిలు తయారు చేస్తున్నారు. 5 క్వింటాళ్ల గోధుమపిండి, 5 క్వింటాళ్ల బెల్లం, 1 క్వింటాల్ చక్కెర, 270 కేజీల నెయ్యితో 15మంది వంట నిపుణులు అప్పకజ్జాయిలు తయారు చేస్తున్నారు. వీటన్నింటిని నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేస్తారు. కనీసం 7వేలమందికి అన్నదానం చేస్తారు. పాలకవర్గ కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యా శబరాయ, కార్యనిర్వహణాధికారి కేవీ శ్రీనివాస్‌ల నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రకాశ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేసిన మట్టి వినాయకులతో విద్యార్థులు



కేఆర్ మార్కెట్‌లో పూల విక్రయాలు



సాంకి చెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు



టీడీపీ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

వేదికపై ఎంపీ అంబికా, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, గుమ్మనూరు, అమిలినేని, శ్రావణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు



హాజరైన నేతలు

అందరికీ న్యాయం

పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత గౌరవం

క్రమశిక్షణతో మెలగాలి

2029లో గెలుపే లక్ష్యం కావాలి

త్రీమెన్ కమిటీ సభ్యులు రవినాయుడు, బాలవీరాంజనేయులు, అమర్‌నాథ్ రెడ్డి

30 ఏళ్లవారు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందటోళ్లు ఆరాటం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీకి కష్టకాలంలో శ్రమించిన వారికి సముచిత గౌరవం ఉంటుందనీ, అన్ని కులాలు, నియోజకవర్గాలకు పార్టీ పదవుల్లో సమన్యాయం జరుగుతుందని పార్టీ పరిశీలకులు, త్రీమెన్ కమిటీ సభ్యులు రవినాయుడు, డోలా బాలవీరాంజనేయులు, అమర్‌నాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంపై సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టి పెట్టారని తెలిపారు. పార్టీ పదవులు ఆశించే హక్కు అందరికీ ఉందనీ, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అందరికీ పార్టీ అధిష్టానం న్యాయం చేస్తుందన్నారు. 30 ఏళ్ల కిందట వచ్చిన వారు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందట వచ్చిన వారికి ఆరాటం ఎక్కువైందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ 70 శాతం పదవులు ఇచ్చారన్నారు. అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం టీడీపీ అనంతపురం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. త్రిసభ్య సమిటీ సభ్యులు రాష్ట్ర సామాజిక, వికలాంగులు, పౌర సంక్షేమం, సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులు,



ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఇవి ప్రపోజల్స్ మాత్రమేననీ, పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ పదవుల్లో అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.

మూడేళ్ల కిందట వచ్చినోళ్ల ఆరాటం

● పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి

నేను ఈ స్థాయికి రావడానికి 30 ఏళ్లు పట్టింది. నాతోపాటు ఇక్కడే ఉన్న అమర్‌నాథ్‌రెడ్డి కూడా సర్పంచ్ స్థాయి నుంచి వచ్చారు. 30 ఏళ్ల కిందట వచ్చిన వాళ్లు ఓపికతో ఉంటే.. మూడేళ్ల కిందట వచ్చిన వారు ఆరాట పడుతున్నారు. ప్రతిపక్షంలో 5 ఏళ్లు కష్టపడిన వారిని పార్టీ అధిష్టానం తప్పక గుర్తిస్తుంది. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎవ్వరినీ మరచిపోలేదు. ఒకవైపు 10 లక్షల కోట్ల అప్పులు, జీతాలకే సరిపోయే ఆదాయం వచ్చే పరిస్థితులున్నా.. సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందించేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో శ్రమిస్తున్నారు. 16 వేల పైచిలుకు టీచర్ పోస్టులు, 64 లక్షల మందికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేశారు. అనంతపురంలో సైతం వచ్చే మూడు, నాలుగేళ్లలో అన్ని ప్రాజక్టులు పూర్తయ్యేలా చూస్తాం. వచ్చేనెల 6న అనంతపురంలో నిర్వహించే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభకు సుమారు 2.50 లక్షల మందిని కలిపేలా ప్రణాళిక ఉంది. విజయవంతం చేసేందుకు అందరూ కలిసి అడుగేయాలి.

కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జితేంద్రగౌడ్, ఉన్నం హనుమంతరాయచౌదరి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, జేఎల్ మురళి, దేవళ్ల మురళి, జయరాంనాయడు, గంపన్న, జిల్లా నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లాకు చాలా చేయాలనే యోచనలో పార్టీ



అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట. పార్టీ సైతం జిల్లాకు చాలా చేయాలనే చేస్తోంది. ఎవరికైనా పార్టీ పదవులు ఆశించే అర్హత ఉంది. తాము పార్టీని ఏ విధంగా ఉపయోగపడతామో...ఎంత మేరకు అర్హులమో కూడా బేరీజు వేసుకోవాలి. అర్హులందరికీ అనుబంధ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో న్యాయం జరిగేలా, సముచిత స్థానం దక్కేలా చూస్తాం. కష్టకాలంలో కష్టపడిన వారికి, పోరాడిన వాళ్లను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గుర్తించి, తప్పక న్యాయం చేస్తారు.

- రవినాయుడు, శాప్ చైర్మన్

సమాన అవకాశాలు



పార్టీ పదవుల్లో అన్ని నియోజకవర్గాల నాయకులకు సమాన అవకాశాలు ఉంటాయి. సమాన ప్రాతినిధ్యం లభిస్తుంది. శ్రేణులను కుటుంబ సభ్యులుగా చూసే ఏకైక పార్టీ టీడీపీ. పార్టీ సంస్థాగత పటిష్టతపై అధిష్టానం దృష్టి పెట్టింది. అందరూ సహకరించాలి. 2029లో మళ్లీ అధికారం చేపట్టేలా శ్రేణులు కృషి చేయాలి.

- డోలా బాల వీరాంజనేయులు, మంత్రి

పారదర్శకంగా ఎన్నికలు



పార్టీలో పారదర్శకంగా ఎన్నికలు ఉంటాయి. పదవుల పంపకాల్లో అందరికీ అవకాశాలు కల్పించేలా టీడీపీ అధిష్టానం అడుగేస్తోంది. మీ విన్నపాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం. ప్రతిపక్షంలో ఉన్నపుడు టీడీపీ కోసం పోరాడి ఇబ్బందులు పడిన వారికి తప్పకుండా అవకాశాలు వస్తాయి. **- అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిశీలకుడు**

రేపే సర్టిఫికెట్ల పరిశీలన

● పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లు

● ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థులకు కాల్ లెటర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 నియామకాలకు సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది. డీఎస్సీ సెలెక్షన్ లిస్టు విడుదల ఆలస్యం కావడంతో ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన మూడు రోజులు వాయిదా పడింది. ఎంపిక జాబితా సిద్ధం కావడంతో ఈనెల 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు రాష్ట్రశాఖ నుంచి జాయింట్ డైరెక్టరు సుబ్బారావును స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, ఇక్కడకు పంపించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అనంతపురం శివారు, ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులందరూ గురువారం ఉదయం 9గంటలకు వెరిఫికేషన్ నిర్వహిస్తున్న పీవీకేకే కాలేజ్‌కు హాజరు కావాలని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం వెల్లడించారు.

19కి చేరిన కమిటీలు

ఉమ్మడి జిల్లాలో కలిపి 807 టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించడానికి 16కమిటీల(ముగ్గురు సభ్యులతో)ను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీకి 50మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బాధ్యతలు అప్పగించాలని భావించారు. అయితే మోడల్‌స్కూల్స్‌కు సంబంధించిన పీజీటీ, టీజీటీ జోనల్ పోస్టులకు ఎవరైన జిల్లా అభ్యర్థులు ఎంపికై ఉన్నా ఇక్కడే వారి సర్టిఫికెట్లను పరిశీలించాలని రాష్ట్రశాఖ ఆదేశించింది. ఈనేపథ్యంలో పరిశీలనకు అదనంగా మరో మూడు కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. ఈ ప్రక్రియపై విద్యాశాఖ అధికారులు, కమిటీలతో పాటు ఇతర లైన్ డిపార్టుమెంట్లతో కలెక్టరు వినోద్‌కుమార్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూతోపాటు వైద్యులు కూడా పరిశీలనకు హాజరుకావాలని ఆదేశించారు. బోగస్‌లకు అవకాశం లేకుండా పరిశీలన జరగాలని, పొరపాట్లు బయటపడితే అందుకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు ఉంటాయని కలెక్టరు హెచ్చరించారు.



పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేడీ సుబ్బారెడ్డి, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

మేనేజ్‌మెంట్ల వారీగా టీచర్ పోస్టుల వివరాలు ఇలా..

సబ్జెక్టు	జడ్పీ మేనేజ్‌మెంట్	గవర్నమెంట్	మున్సిపాలిటీలు
ఎస్ఏ,తెలుగు	12	14	02
ఎస్ఏ ఉర్దూ	08	01	00
ఎస్ఏ హిందీ	23	03	02
ఎస్ఏ ఇంగ్లీష్	80	19	04
ఎస్ఏ గణితం	33	07	03
ఎస్ఏ ఫిజిక్స్	50	12	04
ఎస్ఏ బయాలజీ	54	16	0
ఎస్ఏ సోషియల్	98	08	04
సోషియల్ ఉర్దూ	00	01	00
ఎస్ఏ పీడీ	135	08	02
ఎస్జీటీ తెలుగు	41	09	97
ఎస్జీటీకన్నడ	07	00	00
ఎస్జీటీ ఉర్దూ	23	00	00

ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

- అభ్యర్థుల విద్యార్హత ఒరిజనల్ సర్టిఫికెట్లు
- ఇటీవల జారీచేసిన కుల ధ్రువీకరణపత్రం
- కాల్‌లెటర్‌లో సూచించిన మేరకు ఇతర సర్టిఫికెట్లు
- గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడుసెట్ల జిరాక్స్ కాపీలు
- కొత్తగా తీసుకున్న ఐదుపాస్ పోర్టు సైజ్ ఫొటోలు
- కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, సమయం, వేదికకు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. హాజరు కాకపోయినా,సర్టిఫికెట్లలో తేడాలొచ్చినా అభ్యర్థిత్వం రద్దు చేయబడుతుంది. అలాంటి సమయంలో తదుపరి మెరిట్ జాబితాలో ఉన్న మరో అభ్యర్థికి అవకాశం కల్పించి వెరిఫికేషన్‌కు పిలుస్తారు.
- అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరవ్వడాని కంటే ముందే సంబంధిత సర్టిఫికెట్లను వారి వ్యక్తిగత మెగా డీఎస్సీ-2025 లాగిన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.

అర్హుల అవస్థలు

రీ వెరిఫికేషన్‌తో అర్హులకు అన్యాయం

● పింఛన్లు అందక దివ్యాంగుల లబోదిబో

● గత పాలకుల అక్రమాలతో ఇబ్బందులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'తమ వారికి' మేలు చేయడానికి గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి ప్రస్తుతం అర్హులకు అవస్థలు తెచ్చిపెట్టింది. తమ పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు వైసీపీ నాయకులు సదరం సర్టిఫికెట్లను అడ్డం పెట్టుకున్నారు. స్లాట్ బుకింగ్, సదరం క్యాంప్ హాజరు, వికలత్వ పర్సంటేజ్ అన్నీ సజావుగా జరిగిపోయేలా గతంలో అధికారులను ఆదేశించారు. దీంతో అవయవాలన్నీ బాగున్న వారు కూడా సదరం సర్టిఫికెట్లను పొందారు. వీరికి వెంటనే పింఛన్లు మంజూరు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పింఛన్ సొమ్ము భారీగా పెరగడంతో అనర్హుల ఏరివేతకు చర్యలు తీసుకుంది. సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌ను ప్రారంభించింది. ఈ ఏరివేతలో కొందరు అర్హులైన దివ్యాంగుల పింఛన్‌ను కూడా ఆపేశారు. దీంతో వారు గత పాలకులు చేసిన పాపం తమకు శాపమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన విభిన్న ప్రతాభావంతుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్‌ఎస్ ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు.



ఆందోళన చేస్తున్న దివ్యాంగులు, సంఘాల నాయకులు

శాఖల సమన్వయలోపం

విభిన్న ప్రతాభావంతుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్‌ఎస్ ఉన్నతాధికారుల సమన్వయలోపం వల్ల తమకు తీరని అన్యాయం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటే ఆయ శాఖల పర్యవేక్షణలో పరిశీలన ప్రక్రియను చేపట్టాలన్నారు. సదరం స్లాట్ బుకింగ్, వికలత్వశాతం పరిశీలన క్యాంప్ డీసీఎహెచ్‌ఎస్ అధికారులు పర్యవేక్షణలో సాగుతోంది. డీఆర్‌డీఏ అధికారులు క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సదరం క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. సంక్షేమ అంశాలను డిజేబుల్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ నాలుగు శాఖల అధికారుల నిర్లక్ష్యం వల్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ పక్కదారి పట్టిందని బాధితులు మండిపడుతున్నారు.

రూ.లక్షల్లో వ్యాపారం

రీ వెరిఫికేషన్ ప్రక్రియ దళారులకు వరంగా మారింది. డీఆర్‌డీఏ, జీజీహెచ్, డీసీహెచ్‌ఎస్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది జేబులు నింపుకుంటున్నారని దివ్యాంగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అనర్హులకు వికలత్వ శాతం ఎక్కువగా చేపిస్తామని చెప్పి పాల్పడుతున్నారని మండిపడుతున్నాయి. సచివాలయం నుంచి నోటీసు అందుకున్న అనర్హులు రీవెరిఫికేషన్ క్యాంప్‌కు ఎలా వెళ్లాలి, క్యాంపులో డాక్టర్లుగా ఎవరుండాలి. దరఖాస్తులు తీసుకోవడం నుంచి భర్తీ చేసేంత వరకు ఏఏ సిబ్బంది పనిచేయాలి. తదితర రీవెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం ముందుగా ప్లానింగ్ చేస్తారు. ఆ మేరకు అనర్హులకు వెరిఫికేషన్ చేసి వికలత్వం ఉన్నట్లు పర్సెంటేజీలు వేస్తున్నారని దివ్యాంగ వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి.

మాకు అన్యాయం చేశారు



రీవెరిఫికేషన్ పేరుతో అర్హులమైన మాకు అధికారులు అన్యాయం చేశారు. వికలత్వంతో నేను ఎంత బాధపడుతున్నానో ఎదుటివారికి స్పష్టంగా కనిస్తున్నా అధికారులకు కనిపించకపోవడం అన్యాయం. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

-రమణ, బూదగవి, ఉరవకొండ మండలం

నలుగురు చేయి పట్టాల్సిందే



నలుగురు చేయపట్టనిదే ఇంట్లోనుంచి బయటకురాని పరిస్థితుల్లో బతుకున్నా. భార్య లక్ష్మీనరసమ్మ కూలి పనులు చేసి అన్నం పెడుతోంది. దగ్గరుండి ఇతరులు పర్యలు చేయకపోతే దుప్పట్లు తడిసిపోతాయి. అయినా రీవెరిఫికేషన్ చేయడం అన్యాయం కాదా?.

- నాగభూషణ, నాగిరెడ్డిపల్లి, అనంతపురం రూరల్ మండలం

ఇంటికొచ్చి పరిశీలించారు..



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత డాక్టర్లు, అధికారులు ఇంటికొచ్చి పరిశీలించారు. నెలకు రూ.15వేల పింఛన్ మంజూరుచేశారు. అయితే రీవెరిఫికేషన్ పేరుతో నోటీసులు జారీచేసి మరోసారి సదరం క్యాంపునకు హాజరు కావాలన్నారు.

-బంగారమ్మ, తలుపూరు, ఆత్మకూరు మండలం

అధికారుల సమన్వయలోపం



విభిన్న ప్రతాభావంతుల సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్‌ఎస్ ఉన్నతాధికారుల సమన్వయలోపం వల్ల మాకు తీరని అన్యాయం జరుగుతోంది. గత ప్రభుత్వంలో అక్రమంగా సదరం సర్టిఫికెట్లను ఇచ్చారని, ఏరివేతలో అర్హులకు అన్యాయం చేయడం తగదు.

- నరసింహులు, ముక్తాపురం, కనగానపల్లి మండలం, ఏపీ ఎమ్మార్పీఎస్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు

2,269 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2,269 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను ఆయన పరిశీలించారు. జిల్లాకు 14-35-14 రకం ఎరువులు 1,111 మెట్రిక్ టన్నులు, 20-20-0-14 రకం 1,158 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. వాటిని ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు.

మరో 527 మందికి ఉచిత ప్రైవేటు విద్య

● ఏపీసీ శైలజ

అనంతపురం విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద జిల్లాలో 527 మంది పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అవకాశం కల్పిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ మంగళవారం తెలిపారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేటు స్కూళ్లలో సీట్లు మిగిలిపోవడంతో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు మరో మారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ సీట్లకు సోమవారం ఎస్పీడీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో లాటరీ తీసి, విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. జిల్లాకు చెందిన మరో 527మంది పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించారన్నారు. ఎంపికైన విద్యార్థులందరూ తమకు కేటాయించిన పాఠశాలల్లో ఈనెల 31వతేదీలోగా చేరిపోవాలనీ, లేకపోతే ఉచిత సీటు రద్దవుతుందని ఏపీసీ శైలజ తెలిపారు.

స్వర్ణ హోరు..!

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంత వాసికి రెండు బంగారు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన రేయాన్స్ రెడ్డి రెండు బంగారు పతకాలు సాధించాడు. కాకినాడలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో లోకేశ్ రెడ్డి, సుభాషిణి దంపతుల కుమారుడు రేయాన్స్‌రెడ్డి ప్రతిభ కనబరచి రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నాడు. విజేతతోపాటు కోచ్ అంజనేయులును పలువురు అభినందించారు.



పతకం సాధించిన రేయాన్స్‌రెడ్డితో తల్లిదండ్రులు, కోచ్

జాతీయ సదస్సుకు డ్వామా ఏపీడీ



సుధాకర్ రెడ్డి

అనంతపురం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ జాతీయ సదస్సు డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి హాజరుకానున్నారు. వాటర్ షెడ్ అభివృద్ధిలో ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ఈనెల 28, 29 తేదీల్లో ఢిల్లీలోని ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్రం తరఫున జిల్లా వాటర్ షెడ్ విభాగ ఏపీడీ సుధాకర్ రెడ్డి ఎంపికయ్యారు. బుధవారం ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్ పోస్టులకు జిల్లాలోని మాజీ సైనికులు, వితంతువులు, వీరనారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. నల్సా వీర్ పరివార్ సహాయత యోజన-2025 కింద ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో ఉచిత న్యాయసేవల క్లినిక్ ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో పారా లీగల్ వలంటీర్ పోస్టులకు డిగ్రీ చదివిన మాజీ సైనికులు, వితంతువులు, వీరనారులు, డిపెండెంట్స్ సెప్టెంబరు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కొవ్వూర్‌నగర్‌లోని జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో నేరుగాగానీ, 08554-241146 ఫోన్ నంబరులోగానీ సంప్రదించాలని కోరారు.

ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం

తొలిరోజు 54 మందికి సీట్ల కేటాయింపు

అనంతపురం వైద్యం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నీట్-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 2025-26 విద్యాసంవత్సరం తొలిరోజైన మంగళశారం 54 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా తెలిపారు. అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శంకర్ నాయక్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఆలిండియా కోటా కింద ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి స్టేట్ కోటా అడ్మిషన్లు చేపట్టారు. 22 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు మెరిట్ మేరకు సీట్లు కేటాయించారు. అనంతరం 24 నుంచి 29వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. సోమవారమే కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా.. సాంకేతిక కారణాలతో అలాట్‌మెంట్ కార్డు డౌన్‌లోడ్ కాలేదు. దీంతో మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. బుధవారం వినాయక చవితి సెలవు అయినా కౌన్సెలింగ్ కొనసాగించనున్నట్లు అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు నీరజ, స్వాతి, లలిత భవాని, జగదీష్, ఏఓ చౌడేశ్వరి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్ శంకర్ నాయక్

సస్పెండైన స్థానంలోనే మరోసారి..!

● హిందూపురం సీటీఓగా క్రిష్ణవేణి

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం సీటీఓగా క్రిష్ణవేణిని ఆన్ డ్యూటీ మీద నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ రకాల ఆరోపణలతో సస్పెండైన నాలుగు నెలలకే ఆమె అదే స్థానంలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. వ్యాపార లావాదేవీలు ఎక్కువగా ఉండే హిందూపురం పట్టణ పరిధిలో కొందరు జీఎస్టీ ఎగవేసి, జీరో వ్యాపారం చేశారు. గుజిరీ, ఐరన్, పట్టు చీరలు, వక్కలు, గుట్కా తదితరాల అక్రమ రవాణా జరిగింది. ఆ సమయంలో సీటీఓ క్రిష్ణవేణి, మరో ముగ్గురు డీసీటీఓలపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఒకరంటే ఒకరికి సరిపడక ఉన్నతాధికారులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో విచారించిన ఉన్నతాధికారులు, ఈ ఏడాది ఫిబ్రవరి 25న నలుగురినీ సస్పెండ్ చేశారు. తిరిగి జూలై 4న డీసీటీఓలకు, 7న సీటీఓ క్రిష్ణవేణికి మరోచోట పోస్టింగ్ ఇచ్చారు. ఆ సమయంలోనూ పాత స్థానాలకే పోస్టింగ్‌లు తెచ్చుకోవాలని వారందరూ ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది.

సీటీఓ క్రిష్ణవేణిని కడప జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సీటీఓగా నియమించారు. తాజాగా పాత స్థానంలోనే ఓడీపై నియమించారు. పన్నుల శాఖ ఉన్నతాధికారి నిజాయతీగా, ముక్కుసూటిగా వ్యవహరిస్తారని పేరుంది. కానీ ఈ వ్యవహారంతో పన్నుల శాఖలో చర్చ మొదలైంది. ఓ ముఖ్య ప్రజాప్రతినిధి పీఏ దీని వెనుక కీలకంగా పనిచేసినట్లు సమాచారం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

వినాయక చవితి



ప్రతి సంవత్సరం భాద్రపద మాసం శుక్ల చతుర్థిని వినాయక చవితిగా ఆచరిస్తారు. పురాణ గాథల ప్రకారం వినాయకుడు చవితిరోజున ఆవిర్భవించినట్టు తెలుస్తోంది. హిందువులు ఆచరించి అతిపెద్ద పండుగలలో వినాయక చవితి ఒకటిగా నిలిచింది. ఇళ్లకే పరిమితం కాకుండా వీధులవారీగా మండపాలను ఏర్పాటు చేసి గణనాథుడికి పూజలు చేస్తారు. స్వాతంత్ర్యానికి పూర్వం హిందూ సమావేశాలకోసం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసేందుకు లోకమాన్య బాల గంగాధర తిలక్ సామూహిక గణేశ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వినాయకుడిని 21 రకాల పత్రులతో పూజ చేస్తారు. నిమజ్జనం వేళ భిన్నరకాలకు చెందిన ఆకులు నీటిలో కలవడం ద్వారా సీజనల్ వ్యాధులపై ప్రభావం తగ్గుతుందనే విశ్వాసం ఉంది.

టీఎన్ రాజరత్నం పిళ్ళై (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు తిరుమరుగల్ నటేశపిళ్ళై రాజరత్నం పిళ్ళై 1898 ఆగస్టు 27న తమిళనాడు రాష్ట్రం తంజావూరులో జన్మించారు. అసలు పేరు బాల సుబ్రమణియన్. అభిమానులు ఆయనను టీఎన్ఆర్‌గా పిలుస్తారు. సంగీతంలో ప్రత్యేకించి తోడి రాగంలో ఎన్నో ప్రయోగాలు చేసి 'నాదస్వర చక్రవర్తి'గా పేరొందారు. అంతేకాక 1939లో 'తిరునీలకంఠర్' సినిమాలో నాదస్వర కళాకారుడిగా నటించారు. 1947లో స్వాతంత్ర్య సంబరాలకు సంబంధించి ఆలిండియా రేడియోలో కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 1956 డిసెంబరు 12న కన్నుమూశారు.

ఓలేటి వెంకటేశ్వర్లు (జయంతి)



ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసులు ఓలేటి వెంకటేశ్వర్లు 1928 ఆగస్టు 27న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. హిందూస్తానీ సంగీతాన్ని డాక్టర్ శ్రీపాద పినాకపాణి గురువు వద్ద నేర్చుకున్నారు. ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రంలో ప్రొడ్యూసర్‌గా సంగీతశాఖను సమర్థవంతంగా నిర్వహించారు. భక్తిరంజని, సంగీత రూపకాలు, యక్షగానాలు, 'సంగీత శిక్షణ' వంటి కార్యక్రమాలతో పేరొందారు. ప్రత్యేకించి ప్రసిద్ధి చెందిన భక్తిరంజనిలో త్యాగరాజు దివ్యనామ కీర్తనలు, తూము నరసింహదాసు కీర్తనలు, రామదాసుకీర్తనలు తదితర వాటిని కర్ణాటక సంగీతంలోని బాణీని వీడకుండా చక్కని సంప్రదాయశైలిలో పాడేవారు. 1989 డిసెంబరు 29న పరమపదించారు.

సర్ డాన్ బ్రాడ్‌మన్ (జయంతి)



అంతర్జాతీయ క్రికెటర్ డొనాల్డ్ జార్జ్ బ్రాడ్‌మన్ 1908 ఆగస్టు 27న ఆస్ట్రేలియా దేశం న్యూ సౌత్ వేల్స్‌లో జన్మించారు. టెస్ట్ క్రికెట్‌లో యావరేజ్ 99.94తో తనదైన రికార్డు నమోదు చేసి గుర్తింపు పొందారు. 20వ శతాబ్దంలో గొప్ప క్రికెటర్‌గా నిలిచారు. ఆయన సాధనలకు పోస్టల్ స్టాంపు, కాయిన్స్ విడుదల చేశారు. రిటైరయ్యేంతవరకు అడ్మినిస్ట్రేటర్, సెలెక్టర్, రైటర్‌గా తన ప్రతిభను చాటారు. ఆయన జీవిత చరిత్రను తెలిపే మ్యూజియంను నిర్మించారు. 2001 ఫిబ్రవరి 25న కన్నుమూశారు. మరణానంతరం 'ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్'లో గుర్తింపు పొందారు.

సుమలత (పుట్టినరోజు)



ప్రముఖ నటి సుమలత 1963 ఆగస్టు 27న మద్రాస్‌లో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాలో విద్యాభ్యాసం కొనసాగించారు. తెలుగు, మళయాళం, కన్నడ, తమిళ, హిందీ భాషలలో 220కుపైగా సినిమాలలో నటించారు. 'శృతి లయలు'కు ఉత్తమనటిగా స్పెషల్ జ్యూరీ అవార్డు, కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ అవార్డ్, ఫిల్మ్‌ఫేర్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. కన్నడ నటుడు అంబరీష్‌ను పెళ్లాడి బెంగళూరులో స్థిరపడ్డారు. మండ్య ఎంపీగా వ్యవహరించారు. ఇటీవల ఆమె గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

మల్బరీ సాగుతో అధిక లాభాలు

అగళి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మల్బరీ తోటల పెంపకంతోనే రైతులకు అధిక లాభాలు వస్తాయని సిరికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, జిల్లా సిరికల్చర్ జేడీ శోభరాణి, ఆర్ఎస్ఆర్ఎస్ డైరెక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. అగళి మండలం దాసేగౌడనహళ్లి గ్రామంలో పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏడీ హనుమంతరాయప్ప ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మల్బరీ తోటలు పెంచుకోవడంవల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటి పెంపకానికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అగళి మండలంలో 300 మంది రైతులు 480 హెక్టార్లలో మల్బరీ తోటలు సాగుచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మల్బరీ పంట వేసినప్పటి నుంచి కోతకు వచ్చేంతవరకు అన్ని రకాల సదుపాయాలు అందిస్తుందన్నారు. వీటి పెంపకం, ఆకు నాణ్యత, రోగాల నివారణ, పట్టుపురుగుకు వచ్చే రోగాల గురించి పలు సూచనలు అందించారు. అవగాహన సదస్సులో మడకశిర సిరికల్చర్ ఏడీ హనుమంతరాయప్ప ఎస్ఓ నవీన్, నాగరాజు, జయరాం, మల్లప్ప, ముడ్లగిరియప్ప, సునీల్, పట్టు రైతులు పాల్గొన్నారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు.. వినాయక చవితికి సర్వం సిద్ధం

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గౌరీ దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. వినాయకుడి తల్లి గౌరీదేవతకు చవితికి ఒకరోజు ముందే ప్రతిష్ఠ పూజలు చేసే సంప్రదాయం రాష్ట్రమంతా జరిగింది. వినాయకచవితి వేడుకలకోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు జోరందుకున్నాయి. బుధవారం వినాయకుడి విగ్రహాలను ఇంటింటా ప్రతిష్ఠ చేసి పూజలు చేస్తారు. ప్రాంతాలవారీగా ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడిని ప్రతిష్ఠ చేస్తారు. ఇంటింటా కొలువుదీరే గణపతులకోసం రాష్ట్రమంతటా మార్కెట్‌లు కిటకిటలాడాయి. వినాయకుడి ప్రతిమను పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు తరలిరావడంతో ప్రతిచోటా సందడి అనిపించింది. ప్రాచీనకాలం నుంచి వినాయక ఆలయాలలోనూ ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. ఒక అడుగు నుంచి మూడు అడుగులలోపు ప్రతిమలు దాదాపు మట్టితోనే తయారు చేశారు. ఈ ఏడాది బెంగళూరు వ్యాప్తంగా పర్యావరణ గణపతులకే ప్రాధాన్యత ఇచ్చారు. బెళగావి, బాగల్కోటె, బీదర్, చిత్రదుర్గ, తుమకూరు, దక్షిణ కన్నడ జిల్లాల్లో వినాయక ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. బెళగావిలో స్వాతంత్ర్యానికి ముందునుంచి ఉత్సవాలు జరిపే సంప్రదాయం ఉంది. చిత్రదుర్గ, బెళగావి, బాగల్కోటెలలో వినాయక విగ్రహాలను హోమాలు జరిపి ప్రతిష్ఠిస్తారు. నిమజ్జనం జరిగేదాకా భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక దక్షిణకన్నడ జిల్లాలో సౌతడ్కలో వందమంది పాక నిపుణులు వినాయకుడికి నైవేద్యం కోసం కజ్జాయిలు, మోదకాలను లక్షదాకా సిద్ధం చేస్తు న్నారు. బెంగళూరు బసవనగుడిలోని దొడ్డగణేశ ఆలయంలో ప్రత్యేక పూజలకు సిద్ధం చేస్తున్నారు.

బెంగళూరులో నిమజ్జన ఏర్పాట్లు

నగర వ్యాప్తంగా వినాయక చవితిరోజున విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె భారీ ఏర్పాట్లు చేసింది. మల్లేశ్వరంలోని సాంకి చెరువు, జయనగర్‌లోని యడియూరు చెరువు, చామరాజపేటలోని కెంపాబుది, హలసూరు చెరువుతో పాటు నగరంలోని దాదాపు అన్ని చెరువులలోనూ వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.



రాజరాజేశ్వరి నగర్‌లోని ఓ ఇంట్లో గౌరీదేవికి పూజ చేస్తున్న మహిళలు



సాంకి చెరువు వద్ద భక్తుల కోసం బ్యారికేడ్లు



చెరువు వద్ద పరిశీలనకు బీబీఎంపీ అధికారుల టెంట్

దళిత సంఘాలతో మంత్రి సమావేశం



దళిత సంఘాల ప్రముఖులతో మంత్రి మునియప్ప

శిడ్లఘట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం 35-40ఏళ్ల పోరాటానికి లభించిన ఫలమని పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప అభిప్రాయపడ్డారు. శిడ్లఘట్ట తాలూకా కంబదహళ్ళిలో దళితసంఘాల ప్రముఖులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మానం స్వీకరించి మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ కులవర్గీకరణ కోసం 1.05 కోట్లమంది సర్వే చేశారన్నారు. జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ సకాలంలో నివేదిక సమర్పించిందని వారికి ధన్యవాదాలన్నారు. శాసనసభలోనూ సీఎం, డీసీఎంతోపాటు మంత్రులందరూ ఏకగ్రీవంగా ఆమోదం పలికారన్నారు. తద్వారా వెనుకబడిన ఎస్సీవర్గాలకు ఎంతో అనుకూలం కానుందన్నారు. కాగా సంచారజాతులను సి గ్రూప్‌లో చేర్చడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గాలకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేసేందుకు తీర్మానించిందని జనాభా ఆధారంగా రిజర్వేషన్ల అంశం లేదా ఇతర అంశాలైనా పరిష్కరించేందుకు వీలు కానుందన్నారు. రాజ్యాంగబద్ధంగా కేటాయించిన రిజర్వేసన్లను మనం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా శిడ్లఘట్టలో పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యేతో కలసి ముఖ్యమంత్రితో మాట్లాడామని త్వరలోనే తేదీ నిర్ణయిస్తారన్నారు. ఈ సందర్భంగా దేవనహళ్ళి, శిడ్లఘట్ట, కోలారు ప్రాంతాలకు చెందిన దళితసంఘాల ప్రముఖులు పాల్గొని మంత్రిని ఆత్మీయంగా సత్కరించారు.

ధర్మస్థల పవిత్రతకు భంగం కలిగించరాదు

శిడ్లఘట్ట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రం ధర్మస్థల పవిత్రతతకు భంగం కలిగించే సాగుతున్న కుట్రను అడ్డుకోవాలని కోరుతూ వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ మాట్లాడుతూ పరిస్థితులు ఇలాగే కొనసాగితే హిందూదేశంలో హిందువులు పరాయివారువలే బతికే రోజులు ఎంతోదూరం లేదని విచారం వ్యక్తం చేశారు. ధర్మస్థల మంజునాథస్వామి ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా సాగుతున్న కుట్రను అందరూ అడ్డుకోవాలన్నారు. కుట్రకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవలికాలంలో హిందూ ధర్మం, ఆలయాల పవిత్రకు భంగం కలిగి కుట్రలు సాగుతున్నాయని వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలో వివిధ హిందూసంఘాల కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. ప్రపంచంలో అన్ని ధర్మాలకు ఎన్నో దేశాలు ఉన్నాయని, హిందువులకు ఉన్నది ఏకైక దేశం భారత్ మాత్రమే అన్నారు. కాగా ఒక వర్గాన్ని తృప్తి పరిచేందుకు కులాలు, మతాల మధ్య విషబీజాలు నాటేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారన్నారు. రైతు సంఘం, ఒక్కలిగ సంఘం, ధర్మస్థళ సంఘం, ఆటో డ్రైవర్ల సంఘం, పతంజలి యోగ శిక్షణ సమితి, శ్రీరామసేన, తదితర సంఘాలు నిరసనలో పాల్గొన్నాయి. నిరసనలో మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, బీజేపీ నాయకులు సీకల్ ఆనందగౌడ, కంబదహళ్ళి సురేంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో సీకల్ రామచంద్రగౌడ, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ

క్యాన్సర్‌పై మరిన్ని పరిశోధనలు అవసరం



చర్చాగోష్టిలో పాల్గొన్న డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై మరిన్ని పరిశోధనలు అవసరమని హెచ్‌సీజీ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ డాక్టర్ బీఎస్ అజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. నగరంలో బెస్ట్ ఆఫ్ ఏఎస్ సీఓ 2025 చర్చాగోష్టి జరిగింది. దేశవ్యాప్తంగా 500మంది క్యాన్సర్ వైద్యనిపుణులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా క్యాన్సర్ పరిశోధనలో వస్తున్న అంతర్జాతీయస్థాయి విధానాలపై పలువురు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ అంకాలజీ ద్వారా గుర్తింపు పొందిన గ్లోబల్ హెల్త్‌కేర్ అకాడమీ చర్చాగోష్టి నిర్వహించింది. దేశంలో తొలి మెడ్- ఎడ్‌టెక్ ప్లాట్‌ఫాంగా పేరొందిన గ్లోబల్ హెల్త్‌కేర్ వైద్య వృత్తిదారులకు ప్రత్యేక చర్చాగోష్టులు, నైపుణ్య నిర్మాణం పెంపొందించుకునే అవకాశం కల్పిస్తోంది. కటింగ్ ఎడ్జ్ థెరపీలో భాగంగా ఇమ్యునో థెరపీ, సీఏఆర్-టీ కణాల చికిత్సకు సంబంధించి పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. క్యాన్సర్ అనేది వేచి ఉండదని సకాలంలో గుర్తిస్తేనే జీవితం కాపాడుకోవచ్చునన్నారు. చెన్నైలోని అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ రాకేశ్ జలలితోపాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బలం.. ఐఎన్‌టీయూసీ

బొమ్మనహళ్ళి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి ఇండియన్ నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) గొప్ప బలంగా ఉందని ఐఎన్‌టీయూసీ కార్యదర్శి శామణ్ణరెడ్డి అభిప్రాయపడ్డారు. అరికెరెలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్‌లో లక్షలాదిమంది సభ్యత్వం కలిగి క్రియాశీలకంగా ఉన్నారన్నారు. కంపెనీలు, ఫ్యాక్టరీలలో కార్మికులకు ఎవరికైనా అన్యాయం జరిగితే ఐఎన్‌టీయూసీ పోరాటం చేస్తోందన్నారు. బొమ్మనహళ్ళి బ్లాక్‌కు ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా వెంకటేశ్ బంజారాను ప్రకటిస్తూ నియామకపత్రాన్ని అందచేశారు. వెంకటేశ్ మాట్లాడుతూ బొమ్మనహళ్ళి పరిధిలో కార్మికుల సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీలో కొనసాగదలిచినట్టు తెలిపారు. ఐఎన్‌టీయూసీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎల్లప్ప, దాసు, భాగ్యారెడ్డి, బొమ్మన హళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, అరికెరె లోకేశ్‌రెడ్డి, ఉమా శ్రీనివాసరెడ్డి, ఓబులేశు, రవి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

స్పీడ్ స్కేటింగ్‌లో రాణించిన విద్యార్థులు

మహదేవపుర, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బెల్జియం దేశంలో 2025 యూరోపియన్ కప్ ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భారతజట్టు ద్వితీయస్థానం దక్కించుకుంది. దేశం తరఫున కర్ణాటక నుంచి ఏడుగురు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో అర్ణమధుసూదన్ ఒక బంగారు పతకం, రెండు వెండి, ఒక కాంస్య పతకం దక్కించుకుని దేశకీర్తిని ఇనుమడింపచేశారు. నగరంలో మంగళవారం ఎస్త్రార్ రోల్ స్కేటింగ్ క్లబ్ యజమాని, కోచ్ ఎస్త్రార్ మాట్లాడుతూ బెల్జియంలో జరిగిన యూరోపియన్ చాంపియన్‌షిప్ పోటీలలో భారత్, జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయన్నారు. అన్ని విభాగాలనుంచి భారత్ రెండోస్థానం దక్కించుకుందన్నారు. నగరంలోని సెయింట్ ఫ్రాన్సిస్‌స్కూల్‌లో ఎస్కర్‌రోలర్ స్కేటింగ్ క్లబ్ 20 సంవత్సరాలుగా తర్ఫీదు ఇస్తోంది. ఇంతవరకు 10వేలమందికిపైగా స్కేటర్‌లకు ట్రైనింగ్ ఇచ్చామన్నారు. రానున్న రోజుల్లో భారతదేశ జట్టు ప్రథమస్థానం దక్కించుకోవడమే లక్ష్యమన్నారు. జట్టు సభ్యులు హిరణ్మయి, రుత్విక్‌రెడ్డి, అపూర్వ హాసిని, అశ్వత్, అభినవ్, హవిసాప్రసాద్,లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. దేశ ప్రతిష్ఠను ఇనుమడింపచేసిన ఎస్త్రార్ క్లబ్ సభ్యులు ప్రసన్నకుమార్, మేనేజర్ సెంథిల్, సహాయక కోచ్ మురళి, మనోజ్, గణేశ్ తదితరులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు.



వివిధ విభాగాల విజేతలు

మహిళా సాధకులకు సన్మానం



సావిత్రీబాయి పూలే మహిళా జాగృతిసంఘం శాఖ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

దొమ్మసంద్ర, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలోని అంబేడ్కర్ భవనంలో కర్ణాటక సావిత్రిబాపులె మహిళా జాగృతి సంఘం దొమ్మసంద్ర శాఖ ప్రారంభం సందర్భంగా సావిత్రిబాపులె, జ్యోతి బాపులె పురస్కారాలను 25మంది సాధకులకు ఆత్మీయంగా సత్కరించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామపంచాయతీ సభ్యురాలు అంబుజ ధనరాజు నేతృత్వంలో 65మంది మహిళలకు వాయనం అందచేశారు. మహిళా జాగృతి సంఘం గౌరవాధ్యక్షుడు ఎం మంజునాథ్, ప్రధాన కార్యదర్శి ప్రియాంక మంజునాథ్‌లను శాలువాతో సత్కరించారు. భరతనాట్య ప్రదర్శన చేసిన పిల్లలను అభినందించారు. ధర్మసాగర విద్యాసంస్థ కోశాధికారి డీవీ ధనరాజ్ మాట్లాడుతూ మహిళా స్వావలంబనకోసం వ్యవసాయం, పుట్టగొడుగుల పెంపకం, కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ వంటి వాటిపై తర్ఫీదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమాజసేవకులు డాక్టర్ గీతా హెచ్ కైవార, సావిత్రిబాపులె మహిళా జాగృతి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రత్నా వెంకటేశ్ దొమ్మసంద్రశాఖ అధ్యక్షురాలు మునిలక్ష్మమ్మ, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు రవీంద్ర, సభ్యులు అంబుజ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత కోసం సన్నాహక సభ



సన్నాహక సభలో మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మంత్రాలయ కార్యక్రమం సెప్టెంబరులో జరగనుంది. ఇందుకోసం మారతహళ్ళిలో మంగళవారం సన్నాహకసభ నిర్వహించారు. సమావేశానికి మాజీ మంత్రి లింబావళి అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురురాఘవేంద్ర మఠంలో రాయర ఆధార అనంతరం స్వచ్ఛ కార్యక్రమం సెప్టెంబరు 1, 2, 3తేదీలలో జరిగనుందని, మహదేవపుర నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మంత్రాలయంనకు వెళ్తామన్నారు. ప్రతి రెండేళ్లకోసారి ఇలా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యకర్తలను బృందాలుగా విభజించి ఒక్కో బాధ్యత అప్పగిస్తామన్నారు. సమావేశంలో రూరల్ బీజేపీ అధ్యక్షుడు పిళ్ళప్ప, అర్బన్ అధ్యక్షుడు శ్రీధర్, నటరాజ్, పాపణ్ణ, వెంకటస్వామిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబోటెక్‌తో 550 ఆపరేషన్లు

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక విధానం రోబోటిక్ ద్వారా 550 ఆపరేషన్లు పూర్తి చేశామని సక్ర ఆసుపత్రి ప్రకటించింది. రాష్ట్రంలో అత్యధిక రోబోటిక్ హార్ట్ ఆపరేషన్‌లు సాధించినట్టు ఆసుపత్రి డైరెక్టర్ అదిల్ సాదిక్ ప్రకటించారు. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే సాధ్యమైందని పేర్కొన్నారు. సాధారణంగా గుండె ఆపరేషన్‌కు 8-10 రోజులు ఆసుపత్రిలో ఉండాలని, 2-3 నెలలపాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కొత్త విధానంతో 3-4 రోజులలోనే డిశ్చార్జ్ చేయడంతోపాటు 2-3 వారాల విశ్రాంతి అనంతరం తమ దైనందిన కార్యకలాపాలలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. బెంగళూరు వాసులే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి చికిత్సలు పొందారన్నారు. గుల్బర్గాకు చెందిన 78ఏళ్ల మహిళకు ఇటీవలే శస్త్రచికిత్సలు చేశామన్నారు.

71ఏళ్ల మహిళకు కిడ్నీ శస్త్రచికిత్స

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మూత్రంలో రక్తం వస్తుండగా ఆసుపత్రికి చేరిన 71ఏళ్ల మహిళకు కిడ్నీ శస్త్రచికిత్సలు విజయవంతం చేసినట్టు మెడికవర్ ఆసుపత్రి యూరాలజిస్ట్ దిలీప్ తెలిపారు. వయోభారంతోపాటు ఆమె పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనేవారన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బాధిత మహిళకు కేవలం 5 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేదన్నారు. సాధారణ ఆపరేషన్ అంటే సాధ్యం కాదని, రోబోటిక్ ద్వారా సర్జరీ చేశామన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుటపడిందని డాక్టర్ దిలీప్ తెలిపారు.

చెత్తకుప్పలో పుర్రె, ఎముకలు

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళలో పుర్రె వివాదం సంచలనం కలిగిస్తుండగా నగరంలోని ఎలక్ట్రానిక్‌సిటీ సమీపంలోని గోవిందశెట్టిపాళ్య చెత్తకుప్పలో మనిషి పుర్రెతోపాటు ఎముకలు వెలుగులోకి వచ్చాయి. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి పరప్పన అగ్రహార పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు రంగంలోకి దిగి వాటిని స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. అయితే ఓ మెడికల్ విద్యార్థి పరీక్షలు చేసేందుకు తీసుకొచ్చి వాటిని చెత్తకుప్పలో పడేసినట్టు గుర్తించారు. విద్యార్థిని తండ్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎముకలు పడేసింది నేనే అంటూ అంగీకరించారు. అయితే ఎముకలు, పుర్రె కనిపించగానే హత్య జరిగి ఉండవచ్చునని, చేతబడి చేసేందుకు తీసుకొచ్చి ఉంటారనే కథనాలు ప్రచారమైంది.




చెత్తకుప్పలో లభించిన ఎముకలు

హైవేపై గుంతలు

మడకశిర రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొడికొండ చెక్ పోస్టు నుంచి మడకశిర మీదుగా కర్ణాటకలోని శిర వరకు ఎన్‌హెచ్ 544ఈ జాతీయ రహదారి ఉంది. మడకశిర మండలంలోని అగ్రంపల్లి నుంచి గోవిందాపురం వరకు 50 కిలో మీటర్లు దూరంలోపు అధిక చోట్ల మలుపులు ఉన్నాయి. కొన్నిచోట్ల హైవేలో గుంతలు కూడా ఏర్పడ్డాయి. వేగంగా వెళ్లే వాహనాలు మలుపులు, గుంతలు వల్ల తరచూ అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం శిర నుంచి హిందూపురం వైపు వెళుతున్న లారీ అగ్రంపల్లి వద్ద నడి రోడ్డులో ఉన్న గుంత వల్ల అదుపు తప్పి పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొని బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్ట జరగలేదు.

గుంతలకు మరమ్మతులు చేయిస్తున్నాం

అధిక వర్షాలతో జాతీయ రహదారుల్లో కొన్నిచోట్ల రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల రహదారుల్లో గుంతలు పడ్డాయి. వాటికి వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రమాదకర మలుపుల వద్ద సిగ్నల్ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. -సుజిత, ఏఈ



అగ్రంపల్లి వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,627.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	55.393	37,489
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,711	9,488
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	86.27

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గోనాల్, కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలోని హొన్నల్లి గ్రామాల్లో బహిరంగ ప్రదేశాలలో గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించడంగాని, ఎలాంటి వినోద కార్యక్రమాలను నిర్వహించడం కానీ చేయరాదని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన గ్రామాల్లో గణేశ్ ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. యువకులు అల్లర్లు చేయకుండా, మరోవర్గాలకు ఇబ్బంది కలిగించకుండా సంబరాలు చేసుకోవాలన్నారు.

అక్కడే నిమజ్జనం..

బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని నీటి వనరులను సంరక్షించడానికి తుంగభద్ర కాలువ నగరం గుండా వెళ్ళే వివిధ ప్రదేశాల్లో మాత్రమే గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయాలని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు రోడ్డు, తాలూరు రోడ్డు, కప్పగల్లు రోడ్డు, అల్లీపూర్ (హొసపేట రోడ్డు) బెళగల్లు రోడ్డు(డీసీ నగర్) సిరుగుప్ప రోడ్‌లోని హావంబావి, బండిహట్టిలోని ఆలదహళ్ళి రోడ్డు, భత్రిరోడ్డుల్లో నిమజ్జనం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన గణేశ్ విగ్రహాల అమ్మకం, వాడకం, రసాయన రంగులతో గణేశ్ విగ్రహాల తయారీ నిషేధించాలని, మట్టి విగ్రహాలు, సహజ రంగులను ఉపయోగించి తయారు చేసిన గణేశ్ విగ్రహాలను పూజించాలని ఆయన సూచించారు.

కాన్పు సమయంలో మహిళ మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

రాయచూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాన్పు సమయంలో అధికంగా రక్తస్రావం జరిగిన మహిళ, శిశువు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దేవదుర్గ తాలూకా జాలహళ్ళి ఆరోగ్య కేంద్రం పరిధిలోని మనగుండా గ్రామానికి చెందిన శివగంగమ్మ(29)కు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు శివగంగమ్మ దేవదుర్గ తాలూకా ఆస్పత్రిలో చేర్పించారు. సమయానికి వైద్యులు లేకపోవడంతో కాన్పు చేసేందుకు నర్సులు చేసిన ప్రయత్నం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రక్తస్రావం అధికం కావడంతో గందరగోళానికి గురైన కుటుంబ సభ్యులు అక్కడి వైద్యుల సూచన మేరకు మహిళను రాయచూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతుండగానే మహిళతో పాటు జన్మించిన శిశువు సైతం ఆదివారం మృతి చెందింది. వైద్యులు సకాలంలో అందుబాటులో లేకపోవడం వల్లే మహిళ మరించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలం కొరత

● అత్యధికం అద్దె భవనాల్లోనే.. ● కేటాయించిన ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు ● పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన నల్లబండల దుకాణం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):సమగ్ర శిశు అభివృద్ధి పథకం క్రింద అమల అవుతున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు స్థలం లేకపోవడం కష్టంగా మారింది. స్థలం దొరికినా... రాజకీయ గ్రహణం కారణంగా అక్రమార్కులకు అడ్డాగా మారడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో 25 అంగనవాడీ కేంద్రాల నిర్మాణం కోసం టెండర్లు పిలిచినా... కాంట్రాక్టర్లు కమీషన్‌లు ఇవ్వలేదనే కారణంతో సుమారు 8 నెలల పాటు నగరంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కేంద్రాల నిర్మాణం నిలిపివేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిలో ఈ మధ్యనే కొన్నిటికి భూమి పూజ కోగా... ఇంకా ఆరేడు అంగన్‌వాడీ కేంద్రాలు భూమి పూజకు కూడా నోచుకోవడం లేదు. నగరంలో 17వ వార్డు మురికివాడల ప్రాంతంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు కాగా, కార్పొరేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రభుత్వ స్థలాలు గుర్తించారు. వీటిలో ఒక స్థలం ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని నల్లబండల వ్యాపారం ప్రారంభించారు. అయితే స్థానిక కార్పొరేటర్‌ది కర్ర పెత్తనం కావడంతో పరిస్థితి ఎవరికి చెప్పుకోలేని అయోమయంలో అధికారులు మౌనం వహించినట్లు తెలుస్తోంది. అధికార గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 69,922 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వాటిలో 4,740 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత కట్టడాలు ఉండగా, మిగిలిన 13,066 కేంద్రాలు అద్దెగదుల్లోనే పనిచేస్తుండగా, 9,406 కేంద్రాలు ఇతర ప్రభుత్వ కట్టడాల్లో పనిచేస్తున్నాయి. బళ్లారి జిల్లాలో 1,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 881 సొంతకట్టడాలు ఉండగా, 103 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాల, ఇతర కట్టడాల్లో పనిచేస్తున్నాయి. మిగిలిన 374 కేంద్రాలు అద్దె గదుల్లో పనిచేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అద్దె గదుల్లో నడుస్తున్న కేంద్రాలకు అద్దె, నిర్వహణ ఖర్చుల భారం కావడంతో సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ఈ మధ్యనే మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 5వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది నుండి ద్విభాషలో పూర్వ, ప్రాథమిక తరగతులు(ఎల్‌కెజి)లు ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో 75 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ శిక్షణ ప్రారంభైంది. ఈ నేపథ్యంలో అద్దె గదుల్లో నడుస్తున్న అంగనవాడీ కేంద్రాలకు శాశ్వత కట్టడాల కోసం స్థలసేకరణ కోసం వెతుకులాట ప్రారంభించింది. అన్ని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యదర్శులకు మహిళా శిశు సంక్షేమశాఖ లేఖ రాస్తూ అంగనవాడీ కేంద్రాలు స్థల సేకరించాలని కోరింది. దీని ఆధారంగా పాలికె, నగర సభ, కమిషనర్, తహసీల్దారు, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారులకు, పట్టణ పంచాయతీ అధికారులకు ఆయా జిల్లా సిఇఓలు స్థల సేకరణ జరపాలని ఆదేశాలు జారీ చేశారు. బళ్లారి, నగర ప్రాంతాల్లో 155, గ్రామీణ ప్రాంతాల్లో 47 మొత్తం 202 అంగన్ వాడీ కేంద్రాలకు సొంత కట్టడాలు కోసం స్థలాలు అవసరం ఉందని సాంఘీక సంక్షేమ శాఖ అధికారులు తెలుపుతున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు దొరకడం కష్టతరం కావడంతో అధికారులకు కత్తిమీద సాములా తయారైందని చెప్పవచ్చు.

అనంత పద్మనాభుడిగా గణనాథుడు

సర్వసిద్ధి వినాయక మిత్రమండలి ఆధ్వర్యంలో 26ఏళ్లుగా..



సమావేశంలో మాట్లాడుతున్న బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్

బళ్లారి సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని అనంతపురం రోడ్డు పటేల్‌నగర్‌లో సర్వసిద్ధి వినాయక మిత్రమండలి ఆధ్వర్యంలో 26వ గణేశ్ ఉత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు మిత్రమండలి నాయకుడు, బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తెలిపారు. మంటపం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 25సంవత్సరాలుగా శ్రీసిద్ధివినాయక మిత్ర మండలి నేతృత్వంలో విశిష్ట రీతిలో గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. అదే విధంగా ఈసంత్సరం 26వ వార్షిక ఉత్సవాలను జరుపుతామన్నారు. గత సంవత్సరం గణేశ్ ఉత్సవాల్లో అయోధ్య బాలరాముడి రూపంలో గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా నగరంలోని లక్షలాది మంది ప్రజలు అత్యంత ఆసక్తిగా తిలకరించారన్నారు. సాక్షాత్తు అయోధ్య రాముడు వెలసిన దేవాలయం ప్రతిరూపాన్ని ప్రతిష్ఠించడం హర్షణీయమన్నారు. ఈసారి అనంత పద్మనాభుడి రూపంలో వినాయకుడు దర్శనం ఇవ్వనున్నారన్నారు. ఆదేశేషుడిపై పవళించిన అనంత పద్మనాభుడి నాభిలో నుంచి వచ్చిన కమలంలో ఉన్న బ్రహ్మదేవుడికి బదులుగా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నామన్నారు. లక్షన్నర మందికి పైగా భక్తులు దర్శించుకుంటారని, అందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఐదురోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో నిమజ్జనం రోజున భక్తులకు అన్నప్రసాదం అందజేస్తామన్నారు. ఈసందర్భంగా మిత్ర మండలి సభ్యులు జితేంద్ర, దీపక్, గోపి, శ్రవణ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేశ్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

కంప్లి వీధుల్లో పోలీసుల కవాతు



పట్టణంలో కవాతు చేపట్టిన పోలీసులు

కంప్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, ఈద్ మిలాద్ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని అడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్ సూచించారు. పండుగలను పురస్కరించుకుని కంప్లిలో పోలీసులు మంగళవారం కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ ఈ పండుగలో ఏ సమాజం వారైనా సరే ఘర్షణలకు దిగితే వారిపైన కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆ మతం అనుగుణంగాను పండుకున్న అనుసరించుకుని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కంప్లి పట్టణంలో పలు వార్డుల్లో పోలీసులు కవాతు చేపట్టారు. కార్యక్రమంలో డీవై ఎస్పీ ప్రసాద్ గోఖలే సీఐ కేబి వాసుకుమార్, ఎస్ఐలు అవినాష్ కాంబ్లే విరుపాక్షప్ప, సుప్రీత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ బోల్తా

రాయచూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి తాలూకా జీనూరు వంతెన వద్ద ఎక్స్కవేటర్ యంత్రం మంగళవారం బోల్తా పడిది. పోత్నాళ్ నుంచి ఉద్బాళ గ్రామానికి వెళ్లె దారిలో జీనూరు సమీపంలో ఉన్న వంతెన వద్ద రోడ్డు పూర్తిగా తడిసి కుంగిపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవషాత్తు డ్రైవర్ చిన్నగాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు పై పెద్ద సంఖ్యలో గుంతలు పడి నీరు నిలిచి ఉండడంతోపాటు రోడ్డు మరమ్మతులు నాసిరకంగా జరిగినందు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా ఈ మార్గంలో ప్రతి రోజు 10 నుంచి 15 పాఠశాలల బస్సులు సంచ రిస్తా యని బస్సులు బోల్తా జరిగితే ప్రమాదం తీవ్రంగా ఉండేదంటు ఆందోళనకు గురవుతున్నారు.



బోల్తా పడిన ఎక్స్‌కవేటర్

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు బెస్ట్ కాలేజీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

బళ్లారి సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని ప్రీ-యూనివర్శిటీ విద్యాశాఖ నిర్వహించిన తాలూకా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో బెస్ట్ కళాశాల విద్యార్థుల బృందం మొదటి స్థానాన్ని కైవశం చేసుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను సంస్థ అధ్యక్షుడు కోనంకి అభినందించారు. ఉపాధ్యాక్షుడు తిలక్‌కుమార్ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరెడ్డి సిబ్బంది అభినందించారు.

దేశ సేవలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకం

● కసాప జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిష్ఠిరుద్రప్ప

బళ్లారి సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి):దేశానికి సేవచేయడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర చాలా కీలకమని కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప అన్నారు. బుధవారం కొళగల్ గ్రామంలో వీరశైవ మహావిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం కోసం ప్రత్యేక శిబిరం నిర్వహణ కార్యక్రమం 7వరోజు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగావిచ్చేసిన కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో స్వచ్ఛంద సేవకుల సమగ్ర అభివృద్ధికి జాతీయ సేవా పథకం బాధ్యత వహిస్తుంది. ఈపోటీ ప్రపంచలో విద్యార్థులు ఎదగడానికి సహాయపడుతుందన్నారు, శాస్త్రీయ దృక్పథకాలను పెంపొందించుకోవాలని, చెడు అలవాట్లను వదిలించుకోవాలని, పుస్తకాల భాండాగారంగా మారాలని, హృదయ పూర్వకంగా దేశానికి సేవా చేయడానికి సిద్ధంగా ఉండాలని స్వచ్ఛంద సేవకులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల పాలక మండలి అధ్యక్షుడు దరూర్ శాంతనగౌడ, కళాశాల పాలక మండలి సభ్యులు అక్కి శికారాజ్, కరడి పూడి ముద్దనగౌడ, కన్వీనర్ వినోద్‌కుమార్,కవితా సంగనగౌడ, శరణబసవ శిబిర అధికారులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ఉప లోకాయుక్త పర్యటన



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాయచూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో ఈ నెల 29, 30 తేదీల్లో రాష్ట్ర ఉప లోకాయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా లోకాయుక్త అధికారి ఎస్.సతీశ్ సూచించారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం సిల్వర్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లలో పాల్గొన్న అనంతరం మంగళవారం వేదిక స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప లోకాయ్తు జస్టిస్ బీ వీరప్ప ఇప్పటి వరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త కేసులు వాటి పరిష్కారం కొత్తగా దరఖాస్తుల స్వీకరణ వంటి కార్యక్రమం కోసం రెండు రోజుల పాటు ఇక్కడే ఉండనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. వేదిక మొదలుకొని హాజరైయ్యే ప్రముఖులకు ప్రత్యేకంగా హాసనాలు ఏర్పాటు చేయాలని పాత్రికేయులకు, అధికారులకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని వేదికను ప్రకృతి సౌందర్యం ప్రతిబింబించేలా సిద్ధం చేయాలని ఉద్యానవనాల శాఖ అధికారులకు సూచించారు. లోకాయుక్త అధికారి వెంట జడ్పీ ప్లానింగ్ అధికారి రోణి, జడ్పీ సీఈఓ తదితరులున్నారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హొసూరు జోన్

అంగన్‌వాడీ కేంద్రాల్లో మాంటిస్సోరి తరగతులు

● తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ దినేశ్ కుమార్



ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల ప్రారంభోత్సవంలో కలెక్టర్ దినేశ్‌కుమార్

హొసూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హొసూరు పరిధిలోని చిన్న ఎలసగిరి, నల్లూరు అంగన్‌వాడీ కేంద్రాలలలో మాంటిస్సోరి ఇంగ్లిష్‌మీడియంలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను మంగళవారం కలెక్టర్ దినేశ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర పిల్లల అభివృద్ధి పనుల విభాగంతో కలసి టైటాన్ కంపెనీ సీఎస్ఆర్‌లో ఇక్కడ సదుపాయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. 13 అంగన్‌వాడీలోని 450మంది పిల్లలు ప్రయోజనం పొందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టైటాన్ సంస్థ వైరవేల్, ఉదయసెల్వి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు

రోడ్డుపై ఒంటరి ఏనుగు సంచారం

● అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక

హొసూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శానమావు అటవీ ప్రాంతాలలోని జాతీయ రహదారిపై ఏనుగుల సంచారం అధికమైంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ చుట్టుపక్కల గ్రామాల ప్రజలను హెచ్చరించింది. పోటూరు, అజియాళం, నాయకనపల్లి, బీర్జేపల్లి, శానమావు, దొరపల్లి, అంబలట్టి గ్రామాలకు చెందిన గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ రహదారిపై ఏనుగుల సంచారంతో వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం కూడా ఒక ఏనుగు సంచరించగా కొంతమంది ఫోటోలతోపాటు సెల్ఫీలు తీసుకునే యత్నం చేశారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



అంబలట్టి వద్ద రోడ్డు దాటుతున్న ఏనుగు

బ్రోవ రావయ్యా..బొజ్జ గణపయ్యా

● మండపాలకు తరలిన గణనాథులు ● నేటి నుంచి గణేశ్ ఉత్సవాలు ● ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాల అలంకరణలు



బళ్లారి నుంచి గ్రామాలకు తరలుతున్న గణనాథుడు



కంప్లిలో విగ్రహాలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

బళ్లారిరూరల్/కంప్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం అయ్యింది. మంగళవారం గ్రామాలు, పట్టణాలు తేడాలేకుండా చిన్నా, పెద్ద, భారీ విగ్రహాలను ట్రాక్టర్లు, లారీల్లో మండపాలకు తరలించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గణపతి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున షెడ్లు వేసుకుని విద్యుత్ కాంతులతో అలంకరణ ఏర్పాట్లు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రూపనగుడి, కారేకల్, మోకా, వీరాపురంతో పాటు నగరంలోకుమ్మరివీధిలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం పూలు, పండ్లు, పత్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి.

పర్యావరణానికే ప్రాధాన్యం

కంప్లి (ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో వినాయక విగ్రహాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా వినాయకుల కొనుగోలు జరుగుతున్నాయి. వాటితో పాటు పూలు, పండ్ల వ్యాపారం కూడా జోరుగా కొనసాగుతుంది. మార్కెట్లో పూలు, పండ్లకు భలే డిమాండ్ పెరిగింది. సిరిగేరి గ్రామంలో పీఓపీ వినాయకుడి బదులుగా ప్రకృతిని దృష్టిలో వుంచుకుని ఎస్ఎం సహన జొన్నపిండితో తయారు చేసిన వినాయకుడిని వందకు పైగా ఉచితంగా పంపిణీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విద్యార్థి మట్టితోను ఇతర వాటితో తయారు చేసి ప్రతి వినాయక పండక్కి సిరిగేరి గ్రామంలో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.



సిరిగేరి గ్రామంలో పిండితో తయారు చేసిన విగ్రహాల పంపిణీ

దొరికిన ఇంటి దొంగ

● రూ.4.67 లక్షల ఆభరణాలు స్వాధీనం

రాయచూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి పరిసరాల్లో ఇళ్లల్లో దొంగతనం చేస్తు స్థానికులకు దడ పుట్టించిన దొంగ పోలీసులకు పట్టుబడ్డాడు. ఏప్రిల్ 14వ తేదీన హట్టి పట్టణంలోని ఫయాజ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరగడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి ఆచూకీ కోసం తమదైన పద్ధతిలో వేట ప్రారంభించారు. ఈ క్రమంలో కొప్పళ జిల్లాకు చెందిన మస్తాన్ పోలీసుల చేతికి చిక్కాడు. అనుమానంతో ఆయన కదలికల పై నిఘా ఉంచిన పోలీసులు ఎట్టకేలకు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి వద్ద నుంచి రూ.4.67 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా పెయింటింగ్ పేరుతో ఇళ్ల వద్దకు వచ్చి ఇళ్లను చూస్తున్నట్లు నటించిన మస్తాన్ తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. జల్సాలకు అలవాటైన మస్తాన్ ఈ రకంగా దొంగతనాలకు దిగినట్లు పోలీసులు విచారణలో కనగొన్నారు. దొంగను గుర్తించి అదుపులోకి తీసుకున్న హట్టి పోలీసులను ఎస్పీ పుట్టమాదయ్య అభినందించారు.



ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు